

# చీకటికి వెయ్యికళ్ళు

## – కొమ్మూరి సాంబశివరావు



*"ఎవరు చేశారీ హత్య? హంతకుణ్ణి పట్టుకోవాలి. నిజం తెలుసుకోవాలి" అని మంగళ యుగంధర్ని వేడుకుంది.*

*"శవం ప్రక్కన పడున్న పిస్తోలు మీద వేలిముద్రలున్నాయి. హంతకుడు దొరికాడు అరెస్టు చేస్తున్నాను" అన్నాడు ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు.*

*"నీకేమీ భయంలేదు. నిన్ను విడిపించే బాధ్యత నాది" ధైర్యం చెప్పాడు లాయర్ వజ్రాలరావు.*

*మంగళ మర్యాదస్తురాలు. అతడు.. బికారి.. సన్యాసి.. నిందితుడు జైలుకి వెళ్ళి వచ్చిన మాజీ నేరస్థుడు. ఈ ముగ్గురికీ సంబంధం ఏమిటి?*

*లాయర్ వజ్రాలరావు జిత్తులమారి, మేధావి, దొంగలకూ నేరస్థులకూ సన్నిహితుడు.*

*డిటెక్టివ్ యుగంధర్ మొదటిసారి కోర్టులో వాదిస్తాడు. అద్భుతమైన పరిశోధన, సాక్షుల పరీక్ష, క్రాసు పరీక్ష.*

## (ప్రారంభం)

### 1

**డిటెక్టివ్ యుగంధర్ తన కన్సల్టింగ్ రూంలోకి అడుగు పెట్టగానే, ఆమె లేచి నిలుచుంది. చిరునవ్వు నవ్వింది.**

"యుగంధర్ గారూ!" అన్నది.

యుగంధర్ తన చేతిగడియారం చూసుకున్నాడు. తొమ్మిది గంటలు దాటింది. కొంచెం విసుగ్గా ఆమెని చూశాడు.

"తమ పేరు?" అడిగాడు.

"మంగళ. మీ సహాయం కోసం వచ్చాను" అన్నది.

"కూర్చోండి" అని యుగంధర్ బల్లవెనక ఉన్న రివాల్వింగ్ కుర్చీలో కూర్చున్నాడు. పనేమిటో చెప్పమన్నట్లు ఆమెని చూశాడు. ఆమె సందేహిస్తూ ఒకసారి గదంతా చూసింది. చాలా విశాలమైన గది అది. మూడు గోడలకీ ఆనించి నిలువెత్తున రోజ్ వుడ్ అలమరాలున్నాయి. వాటిలో లా పుస్తకాలు, వైద్య పుస్తకాలు, సైన్సు పుస్తకాలు ఉన్నాయి. ఆ గదికి ఒకే కిటికీ ఉంది - చాలా పెద్ద కిటికీ సహానికి నీలంరంగు తెర కట్టివుంది. ఆమె యుగంధర్ బల్లవైపు చూసింది. బల్ల మీద ఫౌంటెన్ పెన్ పెట్టుకునే స్టాండు, లెటర్ పాడ్,

గుండుసూదులు గుచ్చుకునే కుషనూ, టెలిఫోను ఉన్నాయి. యుగంధర్ కుర్చీపక్కన ఒక చిన్న బల్ల, బల్ల వెనుక కుర్చీ ఉన్నాయి. ఆ బల్లమీద టైపు మిషనూ, ఫైల్సు, కాగితాలూ, పెన్సిళ్ళూ ఉన్నాయి. యుగంధర్‌కి మరొకవైపున ఖరీదయిన సోఫాసెట్టు ఉన్నది.

యుగంధర్ ఆమెనే చూస్తున్నాడు. ఆమె గొంతు సవరించుకుంది. చిన్న జేబురుమాలుతో విసురుకుంటోంది. యుగంధర్ కుర్చీలోంచి లేచి వెళ్ళి ఫాన్ స్విచ్ తిప్పి వచ్చాడు. యుగంధర్ని ఆమె రెప్పవాల్చకుండా చూస్తోంది. ఆరడుగుల మూడు అంగుళాల పొడుగు, బలిష్టమైన శరీరం, విశాలమైన నుదురు, కోలగా వున్న మొహం, కండలు తిరిగిన చేతులు, తీక్షణంగా ఉన్న కళ్ళు, నల్లని దట్టమైన కనుబొమలు చూసి నోరు మెదపలేకపోయిందామె.

"మీరు వచ్చిన పని కొంచెం త్వరగా చెబితే -" అన్నాడు యుగంధర్.

ఆమె బలవంతంగా నవ్వు తెచ్చిపెట్టుకుంది. "ఎందుకో భయమేస్తుంది" అంది.

యుగంధర్ ఆమెని ఆపాదమస్తకమూ పరీక్షగా చూశాడు. ఇరవై, ఇరవై అయిదేళ్ళలోపుంటుంది ఆమె వయస్సు. పెదిమలకి ఎర్రని రంగు, చెంపలకి గులాబీల పూత, కృత్రిమంగా తీర్చిదిద్దిన కనుబొమలు, కత్తిరించి ఉంగరాలు చుట్టించిన నల్లని జుట్టు, ఆ జుట్టులో ఒక పక్కగా గుచ్చిన ఎర్ర గులాబీ ఆమె వయస్సు అయిదేళ్ళు ఎక్కువగా కనబడేటట్లు చేసివుండవచ్చు. లేదా అయిదేళ్ళు తక్కువగా కనబడేటట్లు చేసి ఉండవచ్చు. మేకప్‌లో ఉన్న చిత్రమే అది అనుకున్నాడు యుగంధర్.

జారి జారిపోతున్న చీర పమిటని లాగిలాగి భుజం మీద వేసుకుంటోంది. ఎదురుగా కూర్చున్న మొగవాళ్ళని ఇబ్బంది పెట్టేందుకు కొంతమంది స్త్రీలు పమిట పదేపదే జారవిడుస్తుంటారు. ఈమె అటువంటిదేనా అనుకున్నాడు యుగంధర్. యుగంధర్ తనని పరీక్షగా చూడటం గమనించి ఆమె చిన్నగా దగ్గి, పమిట వెనకవేపు నుంచి లాగి, నడుంకి బిగించి "నా పేరు మంగళ" అన్నది.

"ఇందాక చెప్పారు" అన్నాడు యుగంధర్.

"మా వారి పేరు రామారావుగారు."

"ఏ రామారావుగారు? ఆయనకి ఏం ఉద్యోగం? ఎక్కడ ఉంటున్నారు?" చకచక అడిగాడు యుగంధర్ - ఆమె పని త్వరగా ముగించాలని.

"వి.రామారావుగారు వీరాధ్యుల వారు. ఆయన ఏ ఉద్యోగం చేయటం లేదు. చేయవలసిన అవసరమూ లేదు. ఆస్తిపరులు. ఆయన అన్నామలైపురంలో నాల్గవ క్రాస్ రోడ్లో 790 నెంబర్ ఇంట్లో ఉంటున్నారు" అన్నదామె.

"మీరు మీ భర్తతో ఉండడంలేదా? " అడిగాడు యుగంధర్.

ఆమె ఆశ్చర్యంతో చూసి తలవూపి "మనిషిని చూడగానే వాళ్ళ రహస్యాలు కనుక్కునే లాగున్నారే" అంది.

యుగంధర్ నవ్వి "నా కటువంటి విద్యలేవీ రావు. 730 నెంబర్ ఇంట్లో మీవారుంటున్నారని చెప్పారు. అంటే మీరు ఉండడం లేదని అనుకున్నాను" అన్నాడు.

"నాకు తెలుసు - నేను అనుకున్నది నిజం" అన్నది.

"ఏమిటది?"

"మిమ్మల్ని గురించి చాలా విన్నాను. కానీ నమ్మలేదు, మిమ్మల్ని గురించి అందరూ చెప్పుకునే విషయాల్లో అతిశయోక్తి ఏమీలేదని ఇప్పుడు తెలుస్తోంది. మీరు తలుచుకుంటే నా సమస్య క్షణంలో పరిష్కారం చెయ్యగలరు" అన్నది మంగళ.

"అదేమిటో త్వరగా చెబితే "

"చెబుతాను. నాకు కాసిని మంచినీళ్ళు కావాలి. మీరు లేవకండి. ఆ కిటికీలో ఉన్న కూజాలోనివి మంచినీళ్ళేగా! నేను తీసుకుంటాను" అని మంగళ లేచి కిటికీ దగ్గరికి వెళ్ళింది.

వెళుతూ ఒకసారి వెనక్కి తిరిగి యుగంధర్ని చూసింది. కూజాలోంచి గ్లాసులోకి నీళ్ళు వంచుకుని తెచ్చుకుంది. ఆమె నడుస్తున్నట్టు లేదు. గాలిలో తేలిపోతున్నట్టుంది. తనలో వలపు, వయస్సు పుష్టి ప్రస్ఫుటంగా గోచరించేటట్లు ఊగుతూ నడిచింది. ఆమెకది అలవాటా లేక ఆ ప్రదర్శన తనకోసమా అనుకున్నాడు యుగంధర్.

మంగళ  బల్లలదగ్గరికి తిరిగివచ్చి మంచినీళ్ళ గ్లాసు బల్లమీద పెట్టి కూర్చున్నది.

"నాకూ, నా భర్తకీ పొసగలేదు. నేను విడిగా ఉంటున్నాను" అంది.

యుగంధర్ ఏమీ మాట్లాడలేదు.

"విడాకులు ఇవ్వమని వార్ని అడిగాను. ఇవ్వనన్నారు."

"ఏం? ఆయనకి మీరంటే చాలా ఇష్టమా?"

"అబ్బే! అటువంటిదేమీ లేదు. చాలా తిరుగుబోతు, పేరు ప్రతిష్ఠలు పోతాయిట. వారిది సాంప్రదాయమైన, గౌరవమైన కుటుంబమట. రచ్చకెక్కడం ఇష్టంలేదట, అంతా అబద్ధం" అంది కసిగా.

"విడాకులు ఇవ్వకపోవడానికి అసలు కారణం?"

"నన్ను బాధించడానికి. అంతకన్నా ఏముంది?"

"ఎందుకు మిమ్మల్ని బాధించడం? మీమీద ఆయనకెందుకు కసి?"

"ఏమో! ఆయన తత్వం అంతే! హృదయ వైశాల్యం లేదు."

"విడాకులు ఇస్తే తనకీ సుఖమేగా?" అడిగాడు యుగంధర్.

"ఇప్పుడూ తనకి ఆటంకం ఏముంది? ఆయన తన సుఖం తను చూసుకుంటూనే ఉన్నారు" అని కాసేపు ఆగి "ఎటొచ్చీ కష్టం నాకే. జీవనాధారానికి కూడా డబ్బు ఇవ్వడంలేదు. పెళ్ళిలో అత్తింటివారు పెట్టిన నగలన్నీ కూడా తన ఇనపపెట్టెలో పెట్టుకుని, నాకొక్కటీ ఇవ్వలేదు. నడివీధిలోకి నెట్టేశారు."

"కారణం?" అడిగాడు యుగంధర్.

"అదంతా ఇప్పుడు చెప్పి మిమ్మల్ని వేధించడం దేనికి? ఆయనకి పరిమిట్ ఉన్నది. తాగుతారు. రేసులకి వెళతారు. మరికొన్ని ఏహ్యమైన వ్యసనాలు కూడా ఉన్నాయి. నాకళ్ళముందు, అదే ఇంట్లో -" అని పెదిమలు కొరికి, వస్తున్న దుఃఖాన్ని ఆపుకుని మాటలు నిలిపివేసింది.

"అయితే మీరే విడాకులకి అర్జీ పెట్టుకోవచ్చుగా! కోర్టుద్వారా మీ నగలు, స్త్రీ ధనం సంపాదించుకోవచ్చుగా" అన్నాడు యుగంధర్.

"అంత సులభం కాదు. సాక్ష్యం లేదు. సాక్ష్యం లేకుండా జాగ్రత్తపడ్డారు. ఆయన్ని భరించలేక నేను రెండునెలలనుంచీ విడిగా ఉంటున్నాను" అన్నదామె.

"నేను విడాకుల కేసులు తీసుకోను. నాకు అసహ్యం" అన్నాడు యుగంధర్.

"ఆ విషయం నాకు తెలుసు. విడాకుల గురించి కాదు నేను వచ్చింది. ఓ చిక్కులో ఇరుక్కున్నాను. మీరు సహాయం చెయ్యాలి" అన్నది మంగళ.

"చెప్పండి"

"ఒక రోజున చాలా పెద్ద పోట్లాట అయిన తర్వాత నేను మా వారి ఇంట్లోంచి వచ్చేశాను. రెండురోజులు ఓ స్నేహితురాలింట్లో ఉండి తర్వాత ఇల్లు అద్దెకి తీసుకున్నాను. ఆ పోట్లాట వేడిలో మా వారి ఇనపపెట్టె తాళం చెవి తీసుకు వచ్చేశాను. మా వారి దగ్గర ఇంకో తాళం చెవి ఉందిలెండి."

"ఆ!" అన్నాడు యుగంధర్ శ్రద్ధగా వింటున్నాడు.

"దాన్నెలగాయినా సంపాదించాలని నిశ్చయించుకున్నాను. మా వారి ఇంట్లోకి నేను వెళ్ళడానికి వీలులేదు. నన్ను ఇంట్లోకి రానివ్వద్దని నౌకర్లకి చెప్పారు. అందుకని ఓ చిన్న పన్నాగం పన్ని ఆ నెక్లెస్ ఒకటి తీసుకువచ్చి నా కివ్వమని జోగయ్యకి ఇనపపెట్టె తాళం చెవి ఇచ్చాను."

"ఆయన ఏమన్నాడు?"

"సరేనన్నాడు."

నమ్మశక్యం కాకుండా ఉంది అన్నట్లు చూశాడు యుగంధర్.

"జోగయ్య ఒప్పుకోవడానికి కారణం ఉంది. మావారికీ, నాకూ మనస్పర్థలు కలిగిన విషయం అతనికి మొదట్నుంచీ తెలుసు. ఆయనకి చాలా సన్నిహితుడు. ఆ అవకాశం తీసుకుని అతను నాతో చనువు పెంచుకోడానికి ప్రయత్నించాడు. ఒకటి రెండుసార్లు కాస్త మితిమీరి ప్రవర్తించాడు కూడా." యుగంధర్ కళ్ళలోకి చూస్తూ మంగళ నవ్వి, "జోగయ్యని మైలు దూరంలో ఉంచాను. ఈ సహాయం చేసిపెడితే నా దగ్గరకి రానిస్తాననే ఆశ కలిగేటట్లు చేశాను. ఆ ఆశ నెరవేర్చే ఉద్దేశం మాత్రం నాకు లేదు. అతనికి జరిగే అపకారమూ లేదు. అతనిమీద మా ఆయనకి చాలా నమ్మకం. అతన్ని మా ఆయన అనుమానించరు" అన్నది.

"ఇనప్పెట్టెలోంచి నెక్లెస్ దొంగిలించి మీకు తెచ్చి ఇవ్వడానికి ఒప్పుకున్నాడా ఆయన?" అడిగాడు యుగంధర్.

"అవును. ఈ వేళ పొద్దున్న ఆయన నాదగ్గరకి వచ్చాడు. నెక్లెస్ దొంగిలించాననీ, అది తనదగ్గర ఉందనీ చెప్పాడు."

"మీకివ్వలేదా?"

"లేదు. పదివేల రూపాయలు ఇస్తే ఇస్తానన్నాడు" యుగంధర్ వైపు జాలిగా చూసింది. "నా దగ్గర అంత డబ్బు లేదనీ, ఉంటే ఈ దొంగతనమే చేయించేదాన్ని కాననీ చెప్పాను. అతను వినిపించుకోలేదు. పదివేలు ఇస్తేనే నెక్లెస్ తెచ్చి ఇస్తానన్నాడు" ఆమె తల వంచుకున్నది. "చివరికి నా ఆఖరు అస్త్రం, సమ్మోహనాస్త్రం కూడా ప్రయోగించి చూశాను. ప్రయోజనం లేకపోయింది. అతను చలించలేదు. పదివేలు కావాలన్నాడు"

ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి. "ఆ నెక్లెస్ అమ్మితే దాదాపు లక్ష వస్తుంది. దానాలు వద్దు, కోర్టులూ వద్దు. నా దారిన నేను ఉందామనుకున్నాను. అంతా అయోమయం అయింది. నా దగ్గిర అంత డబ్బులేదు కనుక ఆ నెక్లెసుని యధాస్థానంలో ఆయన ఇనుపపెట్టెలో పెట్టేసి తాళం చెవి నాకిచ్చేయమని చెప్పాను. అతను నవ్వి, అదేం కుదరదని చెప్పాడు. వజ్రాలు ఊడదీసి, బంగారం, వజ్రాలు విడివిడిగా అమ్ముతానన్నాడు. తనని ఎవరూ పట్టుకోలేరని అన్నాడు" మంగళ కాసేపు మౌనంగా ఉండిపోయింది. "జరిగినదంతా విపులంగా రాసి మా ఆయనకి ఉత్తరం పంపిద్దామనుకున్నాను. కానీ జోగయ్య అంతా అబద్ధమంటే నిజమని నేనెలా నిరూపించగలను. ఆయన అతని మాటలకే విలువ ఇస్తారు. పోలీసులకి రిపోర్టు చేద్దామనుకున్నాను. కానీ తాళం చెవి అతనికిచ్చినట్లు సాక్ష్యం లేదు. అతను అడిగినట్లు పదివేలు ఇద్దామంటే నా దగ్గర డబ్బులేదు. ఏం చేయడానికీ తోచక మీ దగ్గరికి వచ్చాను."

యుగంధర్ మంగళని కొంచెం విసుగ్గా చూశాడు. "నన్నేం చేయమంటారు" అడిగాడు.

"ఎలాగయినా ఆ నెక్లెస్ అతని దగ్గర్నుంచి తెచ్చిపెట్టండి. మిమ్మల్ని వేడుకుంటున్నాను. అది నాది. స్త్రీ ధనం. దాన్ని మీరు నాకు తెచ్చి ఇవ్వడంలో తప్పులేదనుకుంటాను" మంగళ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. యుగంధర్ మౌనంగా ఉండిపోయాడు. కాసేపు దీర్ఘంగా

ఆలోచించి బల్లమీదవున్న టెలిఫోన్ స్విచ్ నొక్కాడు. "ఇప్పుడే వస్తాను" అని ఆ గదిలోంచి బయటికి వెళ్ళాడు. తిన్నగా మేడమీదికి తన గదిలోకి వెళ్ళి టెలిఫోను తీసి ఒక నెంబర్ తిప్పాడు.

"హల్లో! ప్రసాదరావుగారున్నారా" అడిగాడు. పిలుస్తానని అవతలనుంచి చెప్పారు. క్షణం తర్వాత టెలిఫోనులో యుగంధర్‌కి బాగా పరిచితుడయిన ప్రసాదరావు పలికాడు.

"ప్రసాదరావుగారూ వీరాధ్యుల రామారావుగారు మీకు తెలుసా?" అడిగాడు.

"ఎక్కువ పరిచయంలేదు కానీ తెలుసు. రేస్ క్లబ్ మెంబరు. ఏం?"

"ఆయన భార్యని గురించి మీకేమైనా తెలుసా?"

"ఆమెనీ చూశాను ఒకటి రెండుసార్లు."

"ఆమెని వర్ణించి చెప్పగలరా?"

"తెల్లగా ఉంటుంది. కత్తిరించిన జుట్టు, గుండ్రని మొహం, మంచి ఒంటి రంగు. పొడుగు, నల్లని కళ్ళు చాలా?"

"ఇంకా"

"అదొక రకమైన బొంగురు కంఠస్వరం. అందులో జీర ఉంటుంది. బాగుంటుంది. నవ్వుతున్నప్పుడు మరీ బావుంటుంది."

"మనిషి ఎలాంటిది?"

"చాలా మంచిదని విన్నాను. రామారావుని గురించి అలా చెప్పుకోరు. ఆ భార్యాభర్తల మధ్య మనస్పర్థలు కలిగాయనీ, ఆమె భర్తని చదిలి విడిగా ఉంటున్నదనీ మొన్ననే ఎవరో చెప్పగా విన్నాను."

"థాంక్స్" అని యుగంధర్ టెలిఫోను పెట్టేసి కిందకి వచ్చాడు.

"మంగళాదేవిగారూ! తగాదాలు సన్మార్గంలో పరిష్కరించుకోవాలి. న్యాయం మీ వైపేవున్నా, నైతికంగా ఒప్పు మీదే అయినా మీరు న్యాయాన్ని సంపాదించుకోవడంలో అవలంబించే మార్గాలు న్యాయంగా ఉండాలి. అడ్డదారులు మంచివి కావు. చిక్కులు తెచ్చి పెడతాయి. వివేకమూ, లోకానుభవమూ లోపించడంవల్ల మీరిలా ప్రవర్తించారనుకుంటాను. మీకు సహాయం చెయ్యడానికి ప్రయత్నిస్తాను. ఆ జోగయ్య ఉండడం ఎక్కడ?" అడిగాడు యుగంధర్.

"కోడంబాకంలో, ట్రస్టుపురం అరవక్రాస్ రోడ్లో 570 నెంబర్ ఇంట్లో"

"మీరిక్కడే ఉండండి కాసేపట్లో తిరిగి వస్తాను" అని యుగంధర్ బయటికి వెళ్ళాడు.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments